క్లుప్తంగా

నత్త నడకన రోడ్డు విస్తరణ పనులు



నత్తనడకన సాగుతున్న సిద్దిపేట-చిన్నకోడూరు రోడ్డు విస్తరణ పనులు

చిన్నకోడూరు(సిద్దిపేట): 8 కిలోమీటర్ల సిద్దిపేట - చిన్నకోడూరు రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మందకొడిగా సాగుతున్నాయని వాహనదారులు మండిపడుతున్నారు. విస్తరణ పనులు ప్రారంభించి ఏడాది దాటుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ముగిసిన వేసవి సందడి



చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

హుస్నాబాద్‌రూరల్: వేసవి సెలవుల్లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విజ్ఞానం పెంపు కోసం వలంటీర్‌ను నియమించి సందడి కార్యక్రమం నిర్వహించారు. గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలకు ఆసక్తి ఉన్న చిత్ర లేఖనం, పఠనం, రాయడంలో మెలకువలు నేర్పించారు. నెల రోజుల పాటు నిర్వహించిన సందడి కార్యక్రమం గురువారం ముగిసింది. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వరూప, కార్యదర్శి హారిక, వలంటీర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 8, 9వ తేదీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

రాష్ట్ర చిహ్నం పరిశీలనకు వినతి

సిద్దిపేటరూరల్:/సిద్దిపేట జోన్: రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మార్చాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ధర్మ సమాజ్ పార్టీ నుంచి ప్రతిపాదిస్తున్న చిహ్నాన్ని ప్రభుత్వం ఆమోదించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోల్ల రవిబాబు కోరారు. శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ సిద్దిపేట రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నూతన చిహ్నాన్ని ప్రతిపాదిస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర గీతం కూర్పు తెలంగాణ యాసకు, భాషకు సరిపోలేదన్నారు. దీనిపై ప్రభుత్వం మరొకసారి పునరాలోచించాలని, వీలైతే ఇళయరాజా సంగీతంలో చేయించాలని కోరారు.

ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారు

సిద్దిపేట డీసీసీ కార్యదర్శి కమలాకర్

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మునుగుతున్న నావని, దేశికి నేత అని చెప్పుకుంటూ పదేళ్ల పాటు రాష్ట్రంలో నియంత పాలన కొనసాగించిన కేసీఆర్‌కు ప్రజలు ఏకపక్షంగా తీర్పు నిచ్చి తగిన గుణపాఠం చెప్పారని సిద్దిపేట డీసీసీ కార్యదర్శి కమలాకర్ అన్నారు. శుక్రవారం దుబ్బాకలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాహుల్ గాంధీ జోడో యాత్రతోనే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం నుంచి పార్టీకి ఆశించినంత ఓట్లు రాలేదని, నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు పోకడలతోనే పార్టీకి తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సంజీవరెడ్డి, రాజిరెడ్డి, అశోక్, రాజేందర్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శుక్రవారం ఏడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా క్యాడెట్లుకు యోగా, కవాతు, సిమ్యులేటర్ ఫైరింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్‌తో పాటు బ్యాటిల్ క్రాఫ్ట్ వెపన్ ట్రెనింగ్ తరగతులను నిర్వహించినట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ మధుసూదన్‌రావు తెలిపారు. అదే విధంగా నిజామాబాద్ గ్రూప్ తలసేనా శిబిరానికి రాష్ట్రం నుంచి పాల్గొనే 75 మంది క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవాని తెలిపారు. శిబిరంలో ఆల్ఫా, బ్రావో, చార్లితో పాటు డెల్టా కేటగిరీలుగా విభజించి క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించినట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ విజయభాస్కర్ తెలిపారు.

వరుసగా విత్తనాలు విత్తుతూ..





మద్దూరు(హుస్నాబాద్): మండలంలో గురువారం రాత్రి వర్షం పడటంతో రైతులు పంటల సాగుకు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురియడంతో దుక్కి దున్ని పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఈ సమయంలో విత్తనాలు వేస్తే ముందుగానే పంట చేతికి వస్తుందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకొనే పనుల్లో నిమగ్నమయ్యారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



హుస్నాబాద్ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి శివరంజని

జడ్జి శివరంజని

హుస్నాబాద్: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని, చెట్టు లేనిదే మానవ మనుగడ లేదని హుస్నాబాద్ ప్రిన్సిపల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. ఒక చెట్టు నరికితే పది మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలన్నారు.

నేడు లోక్ అదాలత్

హుస్నాబాద్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జడ్జి శివరంజని తెలిపారు. భూ తగాదాలు, వరకట్నం వేధింపులు, చిన్న చిన్న కేసులను లోక్ అధాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు చిత్తారి హన్మయ్య, ఒగ్గొజు సదానందం, ప్రవీణ్, సంపత్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని ఇన్‌చార్జి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో యోగా సాధన చేస్తే మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తుందన్నారు. యోగాతో పిల్లల్లో ఏకాగ్రత పెరిగి వారి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం యోగాలో ప్రతిభ చూపిన వారికి విద్యారంగంలో అడ్మిషన్లు, ఉద్యోగాల్లో కల్పించే రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ ఆసుపత్రులకు దూరంగా, ఆనందానికి దగ్గరగా ఉండాలనుకునేవారు యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

దుబ్బాక టౌన్: అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించిన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన డాకోళ్ల రమేష్ గౌడ్ (35) మతి స్థిమితం లేదు. తాగుడుకు బానిసై తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 6వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిసిన బంధుమిత్రులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. శుక్రవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల వెనుక ఉన్న అటవీ ప్రాంతంలో రమేష్ విగతజీవిగా పడిఉన్నాడు. మృతుడి అన్న మహేష్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న మానిటరింగ్ అధికారి విజయ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో రైతు ఉల్లి బాలయ్య ఆయిల్‌పామ్ తోటలో శుక్రవారం ఆయిల్‌పామ్ మానిటరింగ్ అధికారి విజయ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ రాయితీ వివరాలను తెలియజేశారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం పండిస్తున్న అన్ని రకాల పంటలను మొదటి మూడేళ్ల వరకు అంతర పంటలుగా వేసుకుని ఆదాయం పొందే వెసలుబాటు ఉంటుందన్నారు. అలాగే పామాయిల్ సాగులో చీడపీడల బెడద ఉండకపోవడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగి నికర ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ రవళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కోసం ఇంటింటికీ..



తిమ్మాయిపల్లిలో బడిబాట

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం బడీడు పిల్లలు పాఠశాలల్లో చేర్పించాలనే లక్ష్యంతో చేపట్టిన బడిబాట కార్యక్రమం జిల్లా కేంద్రంలో విజయవంతంగా కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి బడిబాటపై ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

బడీడు పిల్లలను బడిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): బడీడు పిల్లలను బడిలో చేర్పించడానికి మండల పరిధిలోని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల టీచర్లు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చిన్నారులను, విద్యార్థులను అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్, రామంచ గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్‌లు శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు పాఠశాలల్లో లభించే సౌకర్యాలు వివరించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని...

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించి వాటిని బలోపేతం చేయాలని హెచ్‌ఎం రవివర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని వింజపల్లి గ్రామ పరిధిలోని పెరుకలగడ్డలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంగ్లీష్ మీడియంతో పాటు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పతామన్నారు.

ఇంటింటికి తిరుగుతూ..

హుస్నాబాద్‌రూరల్: మన ఊరు బడిలోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల గురించి వివరిస్తున్నారు. శుక్రవారం పోతారం(ఎస్)లో బడిబాట నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు.

పోషకాహారం ఇవ్వడంతో పాటు..

బెజ్జంకి(సిద్దిపేట): బడిబాట కార్యక్రమంలో భాగంగా బెజ్జంకిలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఇంటింటికి తిరిగి హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పోషకాహారంతో పాటు ఆటపాటలతో చదువు నేర్పుతామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే..

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హైస్కూల్ హెచ్‌ఎం మహమూద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో బడిబాట నిర్వహించారు. గ్రామంలోని పలుకాలనీల్లో ఇంటింటికి తిరిగారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్య గురించి వివరించారు.

పాఠశాలలో చేర్పించే..

నంగనూర్(సిద్దిపేట): విద్యాశాఖ ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే బడిబాట కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతోంది. శుక్రవారం వివిధ గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. తిమ్మాయిపల్లి యూపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఉచిత వైద్య శిబిరం**

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రంలో సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సూమారు 473 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సురభి హాస్పిటల్ పీఆర్‌ఓ పరశురాములు మాట్లాడుతూ శస్త్రచికిత్స అవసరమున్న వారికి ఆసుపత్రికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

◆ **నీటి సరఫరా బంద్**

బెజ్జంకి(సిద్దిపేట): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా బెజ్జంకి మండలానికి మిషన్ భగీరథ నీటిసరఫరాను శనివారం, ఆదివారం నిలిపివేస్తున్నట్లు హుజురాబాద్ ఏఈ రాంకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

◆ **ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): 25 ఏళ్లుగా రామకోటి రామరాజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జగదేవ్‌పూర్ వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ జగదేవ్‌పూర్ వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు తాను చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను గుర్తించి సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు రతన్, పరమేష్ శుక్రవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు భానుప్రకాష్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలంతా మళ్లీ సొంత గూటికి వస్తారన్నారు.

◆ **షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం**

హుస్నాబాద్: పట్టణంలోని రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న హైమద్ ఇంటిలో శుక్రవారం షార్ట్ సర్క్యూట్‌తో విలువైన సామగ్రి కాలిపోయింది. ఇంటిలో ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

◆ **కవాతును విజయవంతం చేయాలి**

సిద్దిపేటకమాన్: వరంగల్‌లో జరగనున్న మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపు ఇచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జులై 7వ తేదీన వరంగల్‌లో మాదిగల కవాతు నిర్వహించనున్నామన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నూతన కమిటీలు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

◆ **10న సర్వసభ్య సమావేశం**

సిద్దిపేటరూరల్: ఈనెల 10వ తేదీన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవేందర్ శుక్రవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు వారికి సంబంధించిన ప్రగతి నివేదికలను ఒక రోజు ముందే అందజేయాలని ఆదేశించారు. సమావేశానికి అధికారులు, గ్రామాల ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ఎంపీపీ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

దుబ్బాకటౌన్: వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచి వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ గంగాధరి సంధ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎంపీటీసీలు చేసిన పలు అభివృద్ధి పనులకు బిల్లులను ఇప్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని కోరారు. తమ పదవీ కాలంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ, ఎంపీఓ సయ్యద్ గఫూర్ ఖాద్రి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ తలారి కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తన అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఆయాశాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. రాంసాగర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీవీణ, గ్రామ ప్రత్యేకాధికారి నరేష్ తెచ్చారు. దీనిపై వాటర్ గ్రిడ్ ఏఈ దినేష్ స్పందించి శనివారం నుంచి గ్రామంలోని ట్యాంకులను ఉదయం, సాయత్రం నింపుతామని సమాధానమిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లను పంపిణీ చేస్తున్నారని పలువురు సభ్యులు సభలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని మాట్లాడుతూ లబ్ధిదారులు సకాలంలో తీసుకెళ్లకపోవడంతో గుడ్లు కుళ్లిపోతున్నాయని మరోసారి అలా జరగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలంలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఎంపీటీసీలను సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాజేందర్ రెడ్డి, ఎంపీడీఓ కుమారస్వామి, సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లావణ్య



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

ములుగు(గజ్వేల్): ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామని ములుగు ఎంపీపీ లావణ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర అభినందనీయమన్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. చివరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీడీఓ బీవీఎస్‌ఆర్కే శర్మ ప్రజాప్రతినిధులతో కేక్ కట్‌చేయించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ జయమ్మతో పాటు ఎంపీటీసీలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, మండల పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, మమత బాల్‌రెడ్డి, హరిబాబు, ప్రవీణ్, పోచమ్మ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టిగా మండలం అభివృద్ధికి కృషి

- ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం
- రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామన్న ఎంపీటీసీలు



మాట్లాడుతున్న ఎంపీపీ బాలేషంగౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల సర్వసభ్య చివరి సమావేశం కావడంతో తాము ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులను ఎంపీటీసీలు గుర్తు చేసుకున్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపీపీ బాలేషంగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మండలంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అభివృద్ధి పనులకు ఎంపీటీసీలు అందరూ సమష్టిగా సహకరించారన్నారు. పల్లె పార్కులో, వైకుంఠదామాల్లో, తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీటీసీలు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంపీటీసీలకు మంజూరైన నిధులతోనే గ్రామాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మండలాభివృద్ధికి రూ.కోట్ల నిధులు మంజూరు చేయడం వల్లే అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. పార్టీలకతీతంగా అందరూ సహకరించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల పాలన సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ యాదగిరి, తహసీల్దార్ కృష్ణమోహన్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టించుకునే వారేరి?

- అధికారుల తీరుపై ఎంపీటీసీల ఆగ్రహం
- ప్రేక్షకపాత్ర వహించిన ఎంపీపీ అనసూయ

కొండపాక(గజ్వేల్): గ్రామాల్లో సర్పంచ్‌ల పాలన ముగిశాక ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపాక ఐకేసీ భవనంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమాశం వాడీవేడిగా సాగింది. గ్రామాల ప్రత్యేకాధికారుల, ఎంపీడీఓ నిర్లక్ష్యం కారణంగా కార్యదర్శులు గ్రామాలకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయంటూ వెలికట్ట ఎంపీటీసీ సభ్యుడు చింతల సాయిబాబా సభ దృష్టికి తెచ్చారు. రాజీవ్ రహదారికి, కలెక్టరేట్ కార్యాలయానికి సమీప వ్యవసాయ భూముల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు వెలుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని మర్పడ్గ ఎంపీటీసీ పత్తి ఆంజనేయులు సభలో ప్రస్తావించారు. ఎంపీఓ వీరరాజు విధులకు సక్రమంగా హాజరు కాకపోతుండటంతో పాటు సమావేశానికి గైర్హాజరయ్యాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు ఎంపీపీ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీలు ప్రస్తావించిన పలు అంశాలకు ఎంపీడీఓ సమాధానాలు చెబుతూ కొనసాగించారు. అవిశ్వాస తీర్మానంతో బీఆర్‌ఎస్ ఎంపీపీ ర్యాగల్ల సుగుణ పదవికోల్పోగా జరిగిన మొట్టమొదటి జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం అధికారుల పనితీరుపై వాడీవేడిగా చర్చ జరిగినప్పటికీ ఏ విషయంపైనా ఎంపీపీ స్పందించకపోవడం గమనార్హం. సమావేశంలో ఎంపీటీసీలు ఆరుట్ల లక్ష్మి, పెద్దసాయిగాని యాదగిరి, చిట్యాల హరితారెడ్డి, గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, తహసీల్దార్ దిలీప్ నాయక్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు తిరుపతి రెడ్డి, భూపతి, సత్యం, రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు